శుక్రవారం 11 అక్టోబరు 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/






# విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell : 7013794396

అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపై ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com






రేస్‌కోర్స్ స్థలం ఫోర్త్ సిటీకి! .. ప్రత్యామ్నాయంగా ఒకటిన్నర రెట్ల భూమి 2లో


జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి షాక్.. ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశం 2లో


పోలీసులను పరేషాన్ చేసిన 15ఏళ్ల బాలిక.. 12ఏళ్ల బాలుడితో మూడో సారి పరార్ 3లో


రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు.. వర్లి శ్మశాన వాటికలో ముగిసిన అంత్యక్రియలు 3లో




# యాడ చూసినా సద్దుల సంబురం

## పెద్ద బతుకమ్మ ఆడిపాడిన ఆడబిడ్డలు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: యావత్ తెలంగాణ వ్యాప్తంగా యాడ చూసిన సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పల్లె నుంచి పట్నం వరకు వాడలన్నీ పూలవనాలుగా మారాయి. మహిళలు, యువతులు, చిన్నారుల ఉయ్యాల పాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి నెలకొన్నది. ఈ నెల 2న ఎంగిలి పూలతో మొదలైన బతుకమ్మ సంబురాలు.. సద్దులతో ముగిశాయి. పూలనే పూజించే పండుగలో రాష్ట్రంలోని ఆడపడుచులు.. చిన్నా పెద్ద తేడా లేకుండా పాల్గొన్నారు. గునుగు, తంగేడు, తీరొక్క పువ్వులతో పేర్చిన బతుకమ్మలను సాయంత్రం గ్రామ, వార్డు కూడళ్లలోకి తీసుకొచ్చి ఉయ్యాల పాటలు పాడారు. పాటకు తగ్గట్లుగా చప్పట్లు చరుస్తూ ఆటలాడారు. ఇక హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వ అధికారికంగా సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించింది. సీఎంతో పాటు పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మలతో శోభాయాత్ర అనంతరం క్రాకర్, లేజర్ షో ఏర్పాటు చేయగా.. అందరినీ అలరించింది. మరో వైపు హన్మకొండలోని పద్మాక్షి అమ్మవారి ఆలయం మహిళలతో కిక్కిరిసిపోయింది. బతుకమ్మలతో పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి ఆటలాడారు. చివరకు బతుకమ్మలను చెరువులు, నదులతో పాటు బతుకమ్మ ఘాట్లలో నిమజ్జనం చేసి వెళ్లిరా గౌరమ్మను సాగనంపారు. ఆ తర్వాత మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



# సీఎం ఢిల్లీ పర్యటనలతో నేతల్లో ఆశలు

## నామినేటెడ్ లెక్కనే పార్టీ పదవులకు డిమాండ్!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: అగ్రనేతల ఢిల్లీ పర్యటనలు చూసి.. వాళ్లంతా బోలెడు ఆశలు పెట్టుకున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవుల కోసం పోటాపోటీగా ఎగబడిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇప్పుడు సేమ్ టు సేమ్ పార్టీ పదవుల కోసం కూడా అలాగే ఎదురు చూస్తున్నారు. నామినేటెడ్ పోస్టులు దక్కనివారు కనీసం అధికార పార్టీలో ఏదో ఒక పదవి దక్కకపోదా? అని ఎదురుచూస్తున్నారట. కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్నారు. ఈరోజు, రేపు అంటూ ఊరిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్.. దసరా పండగ సందర్భంగా ఆ పందేరాన్ని పూర్తి చేయాలని భావించింది. దీంతో ఈ పండక్కి పదవులు దక్కించుకుని.. ఫుల్ దావత్ చేసుకుందామనుకున్నారు నేతలు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్.. ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో.. ఈ దసరాలోపు పదవులు పక్కా అనే విశ్వాసం నాయకుల్లో మరింత పెరిగింది. దసరాకు పదవుల దమాకా.. అంటూ భారీగా ప్రచారం కూడా జరిగింది. పీసీసీ కార్యవర్గంతో పాటు, మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా జరిగిపోతుందంటూ.. గాంధీభవన్ సర్కిల్‌లో విస్తృత చర్చే జరిగింది. అయితే, నేతలు పెంచుకున్న ఆశలపై నీళ్లు చల్లినట్టుగా సరికొత్త ముచ్చట తాజాగా వెలుగులోకి వచ్చింది. పండగలోపు పదవుల పందేరం ఉండేలా లేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఆలోపే పూర్తవుతుందనుకున్నా.. ఆ అవకాశం కనిపించట్లేదట. అలా ప్రకటన రాగానే.. ఇలా పదవీ బాధ్యతలు చేపట్టి, దసరాకు మరో దసరాను జోడించి సెలబ్రేట్ చేసుకోవాలనుకున్న నేతలు.. తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారట. పార్టీ ముఖ్యులు ఢిల్లీ వెళ్లి పిసిసి కార్యవర్గంతో పాటు నామినేటెడ్ పోస్టులు, క్యాబినెట్ విస్తరణ సహా కీలక అంశాలపై చర్చించినట్టు ప్రచారం జరిగింది. దీంతో వెరీ సూన్ పదవుల జాతర పక్కాగా ఉంటుందని అంతా అనుకున్నారు. అయితే ఢిల్లీ వెళ్లి ఖర్గే సహా అగ్రనేతలతో సమావేశమైన రేవంత్ పార్టీ పదవులపై ఎలాంటి చర్చా జరపలేదని తెలుస్తోంది. ఆ అవకాశం కూడా రాలేదట. ఎందుకంటే, జమ్ము కాశ్మీర్, హర్యానా ఎన్నికల ఫలితాలపై పార్టీ పోస్టుమార్టం చేస్తోందట. దీంతో, తెలంగాణలో పదవుల పంపకం అంశాన్ని, ఇప్పటికి పక్కనపెట్టినట్టు తెలుస్తోంది. దసరాలోపు పక్కాగా ఏదో ఒక పదవి పక్కాగా తమను వరిస్తుందని ఆశపడిన చాలా నేతలు కనీసం పండగ తర్వాతనైనా ప్రకటన ఉంటుందా లేదా అనే మీమాంసలో పడ్డారట. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 10 నెలలవుతున్నా కష్టపడ్డ తమను గుర్తించడం లేదని వాపోతున్నారట. కనీసం దీపావళికైనా తమ కళ్లలో ఆనందపు వెలుగులు నింపేలా పదవుల ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నారట. ఆలస్యం చేస్తే.. నేతలు, వాళ్లను నమ్ముకున్న క్యాడరూ.. నిరుత్సాహం చెందే అవకాశం ఉందనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఇప్పటికే నేతలందరూ పార్టీ తీరుపై ఆగ్రహంగా ఉన్నట్టు అంతర్గతంగా చర్చ జరుగుతోంది. మరి, హైకమాండ్ ఎలా వ్యవహరిస్తుందన్నదే తెలియాల్సి ఉంది.

# మంత్రి కొండా సురేఖకు మరో షాక్ పరువు నష్టం దావా వేసిన కేటీఆర్





ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. గురువారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమా, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీ పరిశ్రమలోని పలువురుని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

# బతుకమ్మకు ఇస్తామన్నా రెండు చీరలు, రూ.500 ఏవి? : హరీశ్ రావు




ఇయ్యాల్టి న్యూస్, సిద్ధిపేట, అక్టోబర్ 10: బతుకమ్మ పండుగ వేళ కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పారు. బతుకమ్మ పండుగ అంటేనే భిన్నత్వంలో ఏకత్వం అని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పాటు అయ్యాకే.. బతుకమ్మ రాష్ట్ర పండుగ అయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకమ్మ పండుగకు రెండు చీరలు, రూ.500 ఇస్తామన్నారు.. అవి ఎటు పోయాయని హరీష్ రావు ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి దాని మీద సోయే లేదని విమర్శించారు. అంతకుముందు మరో సందర్భంలో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగ నియామక పత్రాలు కూడా కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్ల వల్లే అని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

# బీజేపీ ఆఫీసుకు మాజీ మంత్రి మల్లన్న..ఎందుకంటే..?



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని తన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజశేఖర్ రెడ్డి కుమార్తె పెళ్లి ఆహ్వాన పత్రిక కిషన్‌రెడ్డికి అందజేసి వివాహ మహోత్సవానికి హాజరుకావాలంటూ సాదరంగా ఆహ్వానించారు. మనవరాలు పెళ్లి శుభలేఖ ఇచ్చి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వంగా ఆహ్వానించడానికి తాము బీజేపీ కార్యాలయానికి వచ్చినట్లు మల్లారెడ్డి తెలిపారు. వ్యక్తిగతంగా కిషన్‌రెడ్డి నాకు చిన్నప్పట్నుంచి బాగా తెలిసిన వ్యక్తి ఆయన బీజేపీలో అంచెలంచెలుగా కేంద్రమంత్రి స్థాయిదాకా ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరో వైపు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్?లోని సీఎం నివాసానికి తన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి వెళ్లారు. మర్రి రాజశేఖర్ రెడ్డి కూతురు పెళ్లి ఆహ్వాన పత్రికను సీఎం రేవంత్ రెడ్డికి మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి కలిసి అందజేశారు. మూడు రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కూడా కలిసిన మల్లారెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. దీంతో మల్లారెడ్డి తెలుగు దేశం పార్టీలో చేరుతున్నారని పుకార్లు వచ్చాయి. దీన్ని ఖండించిన మల్లారెడ్డి మనువరాలు పెళ్లి నేపధ్యంలో చంద్రబాబును కలిసినట్టు తెలిపారు. ఇవాళ మాత్రం తనకు రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీనని వ్యాఖ్యానించండం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరికాదు: కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: మూసీ పరివాహక ప్రాంతాలకు చెందిన 8 జిల్లాల బీజేపీ అధ్యక్షులతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా, ఆర్ఆర్ఆర్‌పై నేతలతో చర్చించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్న కిషన్‌రెడ్డి.. పేదలను ఒప్పించి మాత్రమే ఖాళీ చేయించాలని, బలవంతంగా వారిని తరలించడం సరికాదన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ముందుగా కమర్షియల్ నిర్మాణాలను మాత్రమే కూల్చాలని ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంతో వేలాది మంది పేదలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందన్నారు. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, నిర్వాసితులకు అండగా కొత్త కార్యచరణ అమలు చేయబోతున్నామన్నారు.


# పరిహారమా..? పరిహాసమా..? బీఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని, సర్కారు వంచనతో మళ్లీ ముంచిందని, ఇది పరిహారం కాదు.. పరిహాసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పంటనష్టం సాయంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్.. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయమని, 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పంట నష్టం అంచనాలను తల్లకిందులుగా ఎందుకు మార్చేసారని, ఏకంగా 3లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయని నిలదీశారు. 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణమని, అపార నష్టంతో అల్లాడుతున్న రైతులను ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా? మానవత్వం ప్రదర్శించలేరా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రుణమాఫీలో దగా జరిగిందని, రైతు భరోసా జాడా పత్తా లేదని, వరదలు ముంచెత్తి నష్టాల్లో, కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదని, అన్నదాతపై ఎందుకీ వివక్ష అని కేటీఆర్ ఆరోపణలు చేశారు.

## ఆదాయ సమీకరణపై

# సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణపై వివిధ శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. గురువారం సీం నివాసంలో జరిగిన ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఆదాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలను సీఎం ఆరా తీశారు. కేసీఆర్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు మోపిందని అప్పటి అప్పులకు వడ్డీలుకట్టేందుకే రాష్ట్ర ఖజానాలో మెజార్టీ వాటా పోతున్నదని అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రి సహా మంత్రులు చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆదాయ మార్గాలు తగ్గుతుంటే అప్పుల భారం పెరుగుతుంటడంతో ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఈ సమీక్షలో సీఎం చర్చించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలకు ఎక్కడా ఆర్థిక పరమైన ఇబ్బందులు ఏర్పడకుండా ఆదాయమార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విషయంలో సీఎం ఆరా తీస్తున్నట్లు సమాచారం. కేంద్ర వద్ద నిధులు రాబట్టుకునే విషయంలో ఎక్కడైనా గ్యాప్ ఏర్పడిందా అనే అంశాన్ని అధికారులను ఆరా తీసినట్లు తెలుస్తున్నది.

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

శుక్రవారం 11 అక్టోబరు 2024



## నాగార్జున పిటిషన్‌పై ..మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీసులు





ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10:హీరో నాగార్జున వేసిన పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు జారీచేసింది. తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని నాగార్జున గత వారం నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. రాజకీయ విమర్శల్లో భాగంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నాగార్జున, నాగచైతన్య, సమంతల పేర్లను ప్రస్తావించారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి షాక్.. ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశం



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్ లపై కేంద్రం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ కమిషనర్ గా పనిచేస్తున్న ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ లో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఏపీ కేడర్ కు చెందిన ఆమ్రపాలి తెలంగాణలో పనిచేస్తున్నారు. అయితే తన కేడర్ ను ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు మార్చాలని ఆమె డీఓపీటీని కోరారు. అయితే ఆమె వినతిని డీఓపీటీ తిరస్కరించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 2010 బ్యాచ్ కు చెందిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని కోరారు. ఖండేకర్ కమిటీ సిఫారసుల ఆధారంగా ఆమె ఏపీ కేడర్ కు చెందుతారని డీఓపీటీ తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీస్ అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఈ కమిటీ నిబంధనల మేరకు పలువురు సివిల్ సర్వీస్ అధికారులు తమ కేడర్ పై ఉన్న అభ్యంతరాలపై క్యాట్ కు దరఖాస్తు చేసుకున్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఈ నివేదిక ఆధారంగా కేడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ అమ్రపాలికి ఏపీ కేడర్ కేటాయించారు. తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి తెలంగాణకే కేటాయించాలని ఆమె చేసుకున్న అప్పీల్ ను అప్పట్లోనే ప్రత్యూష్ సిన్హా కమిటీ తిరస్కరించింది.

## వరంగల్‌లో .. దాండియా ఆడిపాడిన మార్వాడీలు



ఇయ్యాల్టి న్యూస్, హనుమకొండ, అక్టోబర్ 10: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద గల నాగకన్య దేవాలయం వద్ద మార్వాడీలు దాండియా ఆడి పాడారు. సిక్వాల్ బ్రహ్మిణ్ సమాజ్ (మార్వాడీ సమాజ్) ఆద్వర్యంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ప్రతి ఏటా జరుపుకుంటారు. ఎన్నో ఏళ్ళ ప్రాచీనం గల ఈ దేవాలయంలో మార్వాడి లు గత ముప్పై ఏళ్లుగా దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఏర్పాటు చేసి భక్తి పారవశ్యాన్ని చాటుకుంటారు .ప్రతి రోజు అమ్మవారికి నిత్యపూజలు, నైవేద్యాలతో పూజలు అందిస్తు అమ్మవారి ఆశిస్సులు పొందుతున్నారు. నాగకన్య దేవాలయం అనుసంధానంగా సాగుతున్నఈ భవాని మాత నవరాత్రుల పండుగకు ఓప్రత్యేక ఉందని ఇక్కడి మార్వడి వాసులు చెపుతున్నారు.ముఖ్యంగా పిల్లలు కాని వారికి నాగకన్య ఓ వరంలా ఆవిర్భవించిందని అమ్మవారిని దర్శించుకున్న తరువాత అనేక కుటుంబాలకు సంతానం కల్గిందని భక్తుల నమ్మకం. అందుకే సంతాన లక్ష్మిగా పేరుగాచిందని ఇక్కడ భక్తులు భవాని మాత రూపంలో కొలవడం ఇక్కడి ప్రాంతవాసులు ప్రగాడ నమ్మకం అని చెప్పుకోవచ్చు. ఈ కార్యక్రమంలో మాజీ వరంగల్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, వరంగల్ సీక్వాల్ బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు భగీరథ పాండే, విజయ్ వ్యాస్, చందు జోషి, రమేష్ కొలారియా, వినోద్ పాండే,రాజేష్ ఉపాధ్యాయ పాటు సిక్వాల్ బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.

## కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ.. ఎన్ని కోట్లో తెలిస్తే షాకే..?



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 10: విశాఖ వన్ టౌన్ లో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిస్తున్నారు. నాలుగు కోట్ల రూపాయల కరెన్సీ నోట్లతో కన్యకా పరమేశ్వరి గర్భగుడిని అలంకరించారు. అలంకరణలో రూపాయి నోటు నుంచి 500 రూపాయల నోటు వరకు ఇండియన్ కరెన్సీలో ఉన్న అన్ని నోట్లను అలంకరణలో వినియోగించారు. అంతేకాదు.. మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి అలంకరించిన సువర్ణ చీర ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. బంగారు చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సువర్ణ ఆభరణాల అలంకరణలో అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సువర్ణ చీరతో పాటు ఆరు కిలోల బంగారు ఆభరణాలు, సువర్ణ పుష్పలు, బంగారు బిస్కెట్లు, బంగారు నాణేలను కూడా అలంకరణకు వినియోగించారు. అంతేకాదు..పది కిలోల వెండి వస్తువులతోనూ అలంకరణ అమ్మవారి సన్నిధిని విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున సుగంధ ద్రవ్యాలు పంచామృతాభిషేకలతో అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. ఈరోజు అష్టమి కావడంతో మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. లక్ష రూపాయల కరెన్సీతో మొదలై.. ఈ ఏడాది నాలుగు కోట్ల రూపాయల భక్తుల తెచ్చిన కరెన్సీతో అలంకరించామని ఆలయ ప్రధాన అర్చకులు కుమార శర్మ తెలిపారు. భక్తులు తీసుకొచ్చి అలంకరించిన సొత్తును తిరిగి భక్తులకు అందజేస్తామన్నారు. రెండున్నర లక్షలతో అలంకారం మొదలై.. ఇప్పుడు నాలుగు కోట్ల కరెన్సీకి చేరిందని చెప్పారు.

## విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో సీనియర్ కాంగ్రెస్ నేత తొలుపునూరి



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట , అక్టోబర్ 10: ఏపీ బెజవాడ కనకదుర్గమ్మను అంబర్ పేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తొలుపునూరి కృష్ణాగౌడ్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేసిన తొలుపునూరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.. తొలుపునూరి వెంట గడ్డ లక్ష్మణ్ గౌడ్, చందుపటేల్, నరేశ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా నిట్ లో 66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



ఇయ్యాల్టి న్యూస్, హనుమకొండ , అక్టోబర్ 10: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్, (రీజనల్ ఇంజినీరింగ్ కాలేజ్ వరంగల్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఎఎల్సీ)లో గురువారం ఎన్ఐటి వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. హైదరాబాదులో డీడిఆర్డీవోలో విశిష్ట శాస్త్రవేత్త, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ ఎం రాజాబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...యుద్ధంలో సాంకేతికతలో కొత్త పోకడలు", ఆత్మ నిర్భర్ భారత్‌ను సాధించడంలో, ముఖ్యంగా దేశ రక్షణ రంగంలో ఆవిష్కరణల యొక్క కీలక పాత్రను వివరించారు. క్యాంపస్ లైఫ్ సారాంశాన్ని సంగ్రహించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని యూ బాబు విడుదల చేశారు. విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డులు - 2024 వారి వృత్తిపరమైన నైపుణ్యం ప్రదర్శించిన ప్రముఖ పూర్వ విద్యార్థులకు బహుకరించారు. అనంతరం పీఆర్ మోహన్ అవార్డుల పంపిణీ, అస్మాన్ అవార్డు, ఫౌండేషన్ డే క్విజ్ బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ అలుమ్ని అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల అసోసియేటెడ్ డీన్ ప్రొఫెసర్ టి.మహేష్ వారి బృందం ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసారు.



## ఆపదలో అండగా నిలిచిన క్లాస్ మేట్స్

## తోటి మిత్రునికి వైద్యుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం

ఇయ్యాల్టి న్యూస్, మిడ్జిల్ , అక్టోబర్ 10: తమతో చిన్ననాటి నుండి కలిసిమెలిసి తిరిగి ఒకే పాఠశాలలో చదివిన మిత్రుడు కిడ్నీ సమస్యతో తీవ్ర అనారోగ్య భారినపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న తన చిన్ననాటి స్నేహితులు 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందంచి తమ ఉదారత చాటుకున్నారు. మిడ్జిల్ మండలం వాడియాల గ్రామానికి చెందిన కోట రాఘవేందర్ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు.దీంతో ఆస్పత్రిలో చేరడంతో రాఘవేందర్ కు ఆపరేషన్ నిమిత్తం ఐదు లక్షల రూపాయలు అవసరం ఉందని వైద్యులు తెలపడంతో విషయం తెలుసుకున్న 2002 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు స్నేహితుడికి ఆర్థిక సాయం అందంచి ధైరం చెప్పారు.ఇకపై కూడా తోటి మిత్రుడికి అండగా ఉంటామని స్నేహితులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కె. లింగం, హరిబాబు, కె,యాదయ్య, కె. శ్రీనివాసులు, టి.శివ, నిస్సార్ తదితరులు ఉన్నారు.

## శ్రీ దుర్గాదేవీగా జైస్వాల్ గార్డెన్ మైసమ్మ



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 10: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ శ్రీశ్రీశ్రీ మైసమ్మ అమ్మవారు శ్రీ దుర్గా దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల వేడుకల్లో హెూమం, సాముహిక కుంకుమ అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్.రమేశ్ గౌడ్, జి. ప్రసన్న ఆంజనేయులు, సి.యాదవ రెడ్డి, పి వెంకటేష్ గౌడ్, కె.దిలీప్ గౌడ్, పి శ్రీహరి చారి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏ రామాగౌడ్, బి.మధుసూదన చారి తదితరులు ఉన్నారు

## మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన మిడ్జిల్ ప్రెస్



ఇయ్యాల్టి న్యూస్, మిడ్జిల్ , అక్టోబర్ 10: మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు తంగేళ్ల అల్వాల్ రెడ్డి.. అతని భార్య జ్యోతి అల్వాల్ రెడ్డి దంపతులను బాధేపల్లి జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మిడ్జిల్ మండల ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు బాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జ్యోతి అల్వాల్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజేష్, భీమ్ రాజ్, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాసులు,నిసార్, విజయ్, కేశవ్,అశోక్, శ్రీను, నందన్ తదితరులు పాల్గొన్నారు .


## మిడ్జిల్‌లో వాలీబాల్ పోటీలు..

## ప్రారంభించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, మిడ్జిల్ , అక్టోబర్ 10: మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..తంగేళ్ల భాను ప్రకాష్ రెడ్డి స్మారకార్థంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో క్రీడా పోటీలను జరుపుకోవాలని సూచించారు.ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గౌస్ , సంపత్ కుమార్ ,ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు బాల్ రెడ్డి, బాలయ్య, మల్లికార్జున్ రెడ్డి, బుచ్చయ్య, నర్సింలు, ఉస్మాన్, రాం గౌడ్, శేఖర్ రెడ్డి , అశోక్ ,వెంకట్ రెడ్డి ,రాము, పర్వతాలు, బీరప్ప , బాలు తదితరులున్నారు...

## రేస్‌కోర్స్ స్థలం ఫోర్త్‌సిటీకి! .. ప్రత్యామ్నాయంగా ఒకటిన్నర రెట్ల భూమి..!!



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 10: హైదరాబాద్? నగరంలోని ప్రఖ్యాత రేస్?క్లబ్ స్థలాన్ని తీసుకుని ప్రత్యామ్నాయంగా ఫోర్త్?సిటీలో భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు సమాచారం. దేశంలోనే చరిత్ర కలిగిన రేస్?కోర్స్?లలో హైదరాబాద్? రేస్?కోర్స్ ఒకటి. ఇది మలక్‌పేట ప్రాంతంలో సుమారు 168 ఎకరాల్లో ఉంది. ఈ స్థలానికి బదులుగా ఒకటిన్నర రెట్ల భూమిని ఇచ్చేలా చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ ప్రతిపాదన ఇంకా చర్చల దశలో ఉందని, త్వరలోనే తుది నిర్ణయానికి వచ్చే అవకాశమున్నట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. దీంతోపాటు అంబర్‌పేటలో శిథిలావస్థలో ఉన్న సిటీ పోలీసు లైన్(సీపీఎల్) క్వార్టర్ల భూమిని సైతం తీసుకొని, ఈ రెండింటినీ అభివృద్ధికి ఇవ్వడం ద్వారా వచ్చే నిధులను మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల నుంచి సమాచారం. సమీపంలో ఉండేలా: నిజాం హయాంలో మౌలాలీలో 1886లో రేస్‌క్లబ్‌ను ప్రారంభించారు. అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీ తన ఇంటికి సమీపంలో ఉండేలా అదే ఏడాది దీన్ని మలక్‌పేటకు మార్చారు. సికింద్రాబాద్‌లో 1961లో ఏర్పాటైన హైదరాబాద్ రేస్‌క్లబ్ మలక్‌పేటలోని రేస్‌కోర్స్ భూమిని కొనుగోలు చేసి 1968లో అక్కడి నుంచి కార్యకలాపాలు మొదలుపెట్టింది. రేసింగ్, ట్రైనింగ్?, ప్రొఫెషనల్ క్వార్టర్స్?, పార్కింగ్ ఇలా అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసింది. అనంతరం జాతీయ స్థాయిలో పోటీల ద్వారా గుర్తింపు పొందింది. గత ఐదు దశాబ్దాల్లో ఈ ప్రాంతం అనూహ్యంగా విస్తరించింది. ఓల్డ్‌సిటీలోని రద్దీ ప్రాంతం మధ్యలో ఈ క్లబ్? ఉంది.

నేషనల్, ఇంటర్నేషనల్, క్రైం, వైరల్ న్యూస్

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

శుక్రవారం 11 అక్టోబరు 2024



# లాభాల్లో ముగిసిన భారత స్టాక్ మార్కెట్



ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, అక్టోబర్ 10: దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం లాభాల్లో ముగిసింది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ ముందు వడ్డీ రేట్లు మరింత తగ్గిస్తుందనే అంచనాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఉన్న పాజిటివ్ సంకేతాలు మార్కెట్‌పై మన మార్కెట్ పై సానుకూల ప్రభావం చూపాయి. దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టీసీఎస్ గురువారం రెండో త్రైమాసిక ఫలితాలను విడుదల చేయనుంది. ఫలితాలు బాగుంటాయనే అంచనాలు కొనుగోళ్లకు మద్దతిచ్చాయి. గురువారం ట్రేడింగ్ లో... సెన్సెక్స్ 144 పాయింట్లు లాభపడి 81,611, నిఫ్టీ 16 పాయింట్లు లాభపడి 24,998 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ స్టాక్స్ అదరగొట్టాయి. దీంతో నిఫ్టీ బ్యాంకు 523 పాయింట్లు లాభపడి 51,530 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్-30 విభాగంలో... కొటక్ మహీంద్రా బ్యాంకు, జేఎస్‌డబ్ల్యు స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, పవర్ గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, మారుతీ సుజుకీ, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రా టెక్ సిమెంట్, బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్స్ టాప్ గెయినర్లుగా నిలిచాయి.

## ఈ ముగ్గురిలో రతన్ టాటా వారసుడయ్యేది ఎవరు?



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: రతన్ టాటా మృతి నేపథ్యంలో టాటాల వ్యాపార సామ్రాజ్యానికి వారసుడెవరన్న చర్చ తెరపైకి వచ్చింది. ఇప్పుడీ రేసులో మొత్తం ముగ్గురు ఉన్నారు. వారిలో రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటా కుమార్తె మయా టాటా(34) ఒకరు కాగా, ఆమె సోదరుడు నెవిల్లే టాటా (32), వారి సోదరి లీ టాటా (39) పేర్లు వినిపిస్తున్నాయి.నోయెల్ టాటా కుమార్తె అయిన మయా టాటా తన కెరియర్‌ను టాటా ఆపర్చ్యూనిటీ ఫండ్‌తో ప్రారంభించి, అనంతరం టాటా డిజిటల్‌లోకి మారారు. 'టాటా న్యూ' యాప్‌ను అభివృద్ధి చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆమె తన తోబుట్టువులతో కలిసి టాటా మెడికల్ సెంటర్ ట్రస్ట్ బోర్డులో పనిచేస్తున్నారు. ఆమె తల్లి టాటా గ్రూప్ దివంగత చైర్మన్ సైరస్ మిస్త్రీ సోదరి. మయా సోదరుడైన నెవిల్లే టాటా కూడా రతన్ టాటా వ్యాపార సామ్రాజ్యానికి వారసుడిగా కనిపిస్తున్నాడు. కుటుంబ వ్యాపారంలో నిమగ్నమై ఉన్న ఆయన టయోటా కిర్లోస్కర్ గ్రూప్ వారసురాలు మాన్సీ కిర్లోస్కర్‌ను వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడే జంషెడ్ టాటా. ట్రెంట్ లిమిటెడ్ కింద టాటా స్టార్ బజార్ అనే హైపర్ మార్కెట్ చైన్‌ను ఆయన నిర్వహిస్తున్నారు. జుడియో, వెస్ట్‌సైడ్ బాధ్యతలు కూడా ఆయన చేతుల్లోనే ఉన్నాయి.మయా టాటా సోదరి లీ టాటా తాజ్ హోటల్స్, ప్యాలెస్‌లలో పనిచేశారు. ప్రస్తుతం ఆమె టాటా గ్రూప్‌లో భాగమైన ఇండియన్ హోటల్ కంపెనీ కార్యకలాపాలను చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె దృష్టంతా హోటల్ పరిశ్రమపైనే ఉంది.

## పోలీసులను పరేషాన్ చేసిన 15ఏళ్ల బాలిక..

# 12ఏళ్ల బాలుడితో మూడోసారి పరార్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా పోలీసులను 15 ఏళ్ల బాలిక ఇబ్బంది పెడుతోంది. ఒకటి రెండు సార్లు కాదు, ఈ అమ్మాయి మూడోసారి 12 ఏళ్ల అబ్బాయితో పారిపోయింది. గతంలో కూడా రెండు సార్లు పోలీసులు బాలికను పట్టుకుని ఇంటికి తీసుకొచ్చారు. అమ్మాయి తన కుటుంబంతో విసిగిపోయి ఊరు వదిలి వెళ్ళడం ప్రారంభించింది. అయితే అంతకు ముందే ఆ బాలిక మరోసారి 12 ఏళ్ల బాలుడితో కలిసి పారిపోయింది. ఇద్దరూ ఎక్కడున్నారో ఇంకా క్లూ లేదు. విషయం నోయిడాలోని సెక్టార్-58లో ఉన్న బిషన్‌పురా గ్రామం. మంగళవారం సాయంత్రం బాలిక ఇంటి నుంచి పారిపోయింది. కుటుంబం బీహార్‌కు తిరిగి వస్తోంది. అప్పుడు ఆ అమ్మాయి అక్కడ లేదు. తండ్రి ఆటో కోసం వెళ్లాడు. ఆపై తల్లిని, చెల్లెల్ని మోసగించి ఆ అమ్మాయి పారిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఏడుస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కూతురి ఆచూకీ కోసం పోలీసుల సాయం కోరారు.ఈ కుటుంబం



బీహార్‌లోని దర్భంగాకు చెందినది. బాధితురాలి తండ్రి మాట్లాడుతూ- అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వయస్సు 15 సంవత్సరాలు, చిన్న కుమార్తె వయస్సు 12 సంవత్సరాలు. దాదాపు 4 సంవత్సరాల క్రితం అతను తన కుమార్తెలకు చదువు చెప్పించుకునేందుకు నోయిడా వచ్చాడు. బిషన్‌పురాలో అద్దెకు గది తీసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కూతుళ్లకు చదువు చెప్పిస్తున్నారు. ఫిబ్రవరి 2024లో పెద్ద కుమార్తె పొరుగున నివసిస్తున్న మరో ఇద్దరు మైనర్ బాలికలను తన వెంట తీసుకెళ్లిందని తండ్రి చెప్పాడు.పోలీసులు వారం రోజుల తర్వాత బృందావనం నుంచి సెర్చ్ చేసి బాలికను పట్టుకున్నారు. ఇంటి నుంచి రూ.50 వేలు తీసుకెళ్లింది. జైపూర్‌లో తిరుగుతూ బృందావనం చేరుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 15 రోజుల క్రితం బాలిక, ఇరుగుపొరుగున ఉంటున్న 12 ఏళ్ల బాలుడితో కలిసి కనిపించకుండా పోయింది. ఇప్పుడు నోయిడా వదిలి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తండ్రి పోలీసులకు తెలిపాడు. మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి దర్భంగా వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఆటో ఎక్కేందుకు బయటకు వెళ్లాడు. భార్య, చిన్న కూతురు ఇంట్లో సామాన్లు సర్దుతుండగా పెద్ద కూతురు తప్పించుకుని వెళ్లిపోయింది. ఇరుగుపొరుగున నివసిస్తున్న 12 ఏళ్ల యువకుడు కూడా కనిపించడం లేదు. ఈసారి కిషోర్‌ని కూడా తన వెంట తీసుకెళ్లి ఉంటాడని అనుమానిస్తున్నారు. బాలిక ఆచూకీ కోసం బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏడీసీపీ తెలిపారు. బాలిక త్వరలోనే కోలుకుంటుంది.

## ముసలోడా మజాకా..!

## కత్తితో పొడిచేస్తానంటూ.. ట్రాఫిక్ పోలీస్‌కు స్ట్రాంగ్ వార్నింగ్



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: వాహనానికి చలాన్ వేయడంతో ఓ వృద్ధుడు రెచ్చిపోయాడు. ట్రాఫిక్ పోలీసును బహిరంగంగా బెదిరించాడు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లా చందౌసి కొత్వాలి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హెల్మెట్ ధరించకపోవడంతో ఓ ట్రాఫిక్ పోలీస్ సదరు బైక్‌కి చలాన్ వేశాడు. చలాన్ అందుకున్న వృద్ధుడు ట్రాఫిక్ అధికారిని బెదిరిస్తూ 'ఇంకెప్పుడైనా నా వాహనాన్ని ఆపివేస్తే, నేను కత్తితో వచ్చి నిన్ను పొడుస్తాను' అన్నాడు. ఈ ఘటన అనంతరం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. సంభాల్ జిల్లాలోని చందౌసి కొత్వాలి ప్రాంతంలో జరిగిన గొడవలో ఓ వృద్ధుడు ట్రాఫిక్ పోలీసు అధికారిని బెదిరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మంగళవారం రోజున విధుల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వాహనాల చెకింగ్ నిర్వహిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలాన్ విధించారు. ఈ క్రమంలోనే ఓ వృద్ధుడికి ట్రాఫిక్ పోలీస్‌కి మధ్య వాగ్వాదానికి దారితీసింది. వైరల్ వీడియోలో వృద్ధుడు ట్రాఫిక్ అధికారిని బెదిరిస్తూ, ఇంకెప్పుడైనా నా వాహనాన్ని ఆపివేస్తే నేను కత్తితో వచ్చి నిన్ను పొడుస్తాను అని బెదిరింపులకు దిగాడు. అదే సమయంలో, ట్రాఫిక్ పోలీసు తన మొబైల్ ఫోన్‌లో ఘర్షణ మొత్తాన్ని రికార్డ్ చేశాడు. వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది.

## అడ్డంగా బుక్ అయ్యాడు..జర జాగ్రత్త!..లేకుంటే మీరు ఇలానే..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: ఇటీవల సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ వీడియో వైరల్‌గా మారింది. గ్యారీ వాలియా అనే వ్యక్తి పోస్ట్ చేసిన ఓ వీడియో అందరిన్నీ షాక్‌కి గురి చేసింది. "చివరి వరకు ఈ వీడియోను చూస్తే మీరు షాక్ అవుతారు" అనే క్యాప్షన్ పెట్టి షేర్ చేశాడు. వీడియో చూసిన తర్వాత నిజంగా అందరూ అవాక్కయారు. మొదట వీడియో చూస్తే రొటీన్‌గా అనిపిస్తుంది. ఆ తర్వాత అసలు ట్విస్ట్ అందరీన్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఓ బిచ్చగాడు కర్రలు పట్టుకొని అందర్నీ డబ్బులు ఆడుకుంటుండగా చివరికి ఆ వ్యక్తి వికలాంగుడు కాదని ట్విస్ట్ తెలుస్తుంది. డబ్బు సంపాదించడం కోసం కష్టపడి పని చేయడం కంటే ఇతరులను మోసం చేయడం అనే అంశం ఈ వీడియోలో హైలైట్ చేస్తుందని



చెప్పాలి. ఓ వ్యక్తి రెండు కర్రలు పట్టుకొని తాను వికలాంగుడిని అని తన భార్యతో కలిసి డబ్బులు ఆడుకుంటుండగా స్థానికులు అతడు వికలాంగుడు కాదని గుర్తించారు. దీంతో అతన్ని ఆపి నిజస్వరూపాన్ని బయటపెట్టారు. ఈ నేపథ్యంలో అతడు తప్పు జరిగిందని, మరోసారి ఇలా చేయనని స్థానికులను వేడుకున్నారు. వారిని స్థానికులు వదలకుండా అక్కడి నుంచి తరమికొట్టారు. ఈ వీడియోపై నెటిజన్లు రకరకలుగా స్పందిస్తున్నారు. కొందరు ఇలా కాళ్లు, చేతులు బాగానే ఉన్నా మోసం చేసి అడుకోవడం కరెక్ట్ కాదని కామెంట్స్ చేస్తున్నారు. ఈ మధ్య ఎక్స్‌లో ఇలాంటి వీడియోలు బాగా ట్రెండ్ అవుతున్నాయి. సమాజంలో జరుగుతున్న మోసలపైన కొందరు అవగాహన కలిగి ఉండాలని కొందరు ఇలా వీడియోలను పంచుకుంటున్నారు. ఆ వీడియోలు పోస్ట్ చేసిన కొద్ది సమయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

## రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు.. వర్లి శ్మశాన వాటికలో ముగిసిన అంత్యక్రియలు

ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, అక్టోబర్ 10: టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు ముగిశాయి. ముంబైలోని వర్లి శ్మశాన వాటికలో మహారాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. కేంద్రం తరఫున హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. కాగా,, రతన్ టాటా ముంబైలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆయన భౌతిక కాయాన్ని ప్రముఖులు, అభిమానుల



సందర్శనార్థం ముంబైలోని నారిమన్ పాయింట్లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఉంచారు. సినీ, రాజకీయ, వ్యాపార దిగ్గజాలు రతన్ టాటాకు కడసారి నివాళులర్పించారు. సాయంత్రం 4 గంటలకు రతన్ టాటా భౌతిక కాయాన్ని ఎన్‌సీపీఏ నుంచి అంతిమ యాత్రగా వర్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. పలువురు ప్రముఖులు ఈ అంత్యక్రియల్లో పాల్గొని రతన్ టాటాకు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

## "మోదీ అద్భుతమైన వ్యక్తి"..

## పాకిస్తాన్‌కి ధమ్కీ ఇచ్చిన విషయాన్ని చెప్పిన ట్రంప్..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: మరో నెల రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. రిపబ్లికన్ల తరుపున మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాట్ల తరుపున ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హ్యారిస్ యూఎస్ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య పోరు ఎంతో రసవత్తరంగా ఉంది. ఇదిలా ఉంటే, అమెరికా ఎన్నికల్లో ఇండియా ఫ్యాక్టర్ కీలకంగా ఉంది. అమెరికాలో చాలా మంది భారత సంతతి ప్రజలు ఉన్నారు. వీరి ఓట్లు ఎన్నికల్లో కీలకంగా మారాయి. భాతర సంతతి ప్రజల్ని ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.ఇదిలా ఉంటే, ప్రధాని నరేంద్రమోడీని డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. 2019లో తాను ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో హూస్టల్‌లో జరిగిన "హౌడీ మోడీ" సభపై మాట్లాడారు. కమిడియన్స్ ఆండ్రూ షుల్జ్, ఆకాష్ సింగ్‌తో కలిసి "ఫ్లాగ్రాంట్" పోడ్‌కాస్టులో ట్రంప్ పాల్గొన్నారు. ఈ భేటీలో పీఎం మోడీపై ప్రశంసలు కురిపించారు. మోడీ బయటకు శాంతంగా, తండ్రిలా కనిపిస్తారు కానీ, ఆయన కఠినంగా ఉండే మంచి వ్యక్తి అని అభివర్ణించారు.

## లావోస్ పర్యటనలో ప్రధాని మోదీ..

## ఆసియాన్-భారత్.. తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశాలకు హాజరు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 10: ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా లావోస్‌లోని వియంటియాన్ పర్యటిస్తున్నారు. ప్రధాని మోదీకి సెరిమోనియల్ గార్డ్ ఆఫ్ హానర్ లభించింది. ఆసియాన్-భారత్, తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనడానికి ప్రధాని మోదీ గురువారం లావోస్‌కు చేరుకున్నారు. ఆసియాన్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ పర్యటన కొనసాగనుంది. లావోస్‌లో జరగనున్న 21వ ఆసియాన్ భారత్, 19వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని మోడీ పాల్గొంటారు. లావోస్ పర్యటన ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి స్థానిక డబుల్ ట్రీ హోటల్‌లో ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. మోడీకి ఎన్నారైలు జాతీయ జెండాలు, కళాకృతులు అందజేశారు.





అనంతరం స్థానిక యువకులతో కలిసి ప్రధాని మోడీ గాయత్రీ మంత్రం సహా వివిధ శ్లోకాలను పఠించారు. బౌద్ధ భిక్షువులతో కలిసి ప్రధాని మోడీ ప్రార్థనలు చేశారు. లావోస్ సంస్కృతి, వారసత్వ కట్టడాలు, ప్రాచీన కళల వివరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రధాని తిలకించారు.


ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
శుక్రవారం 11 అక్టోబరు 2024


చూసి ముర్వాలే

## సూపర్ హీరోగా బాలయ్య..? నేడే అప్డేట్..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10:బాలకృష్ణ గత కొన్నాళ్లుగా ఫుల్ ఫామ్ లో ఉన్న సంగతి తెలిసిందే. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ 100 కోట్ల హిట్ కొట్టారు బాలయ్య. ఇక ఆహా ఓటీటీలో అన్‌స్టాపబుల్ అనే షోతో వరుసగా మూడు సీజన్లు సందడి చేసారు. ఆ షో ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. మరో పక్క హిందూపూర్ లో ఇటీవల మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ గెలుపు సాధించారు. ఇలా బాలకృష్ణ ఓ పక్క సినిమాల్లో, మరో పక్క షోలలో, మరో పక్క రాజకీయాలలో ఫుల్ ఫామ్ లో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఎన్బీకే 109 సినిమా చేస్తున్నారు బాలయ్య. అయితే తాజాగా ఓ ఆసక్తికర టాక్ వినిపిస్తుంది.బాలకృష్ణ సూపర్ హీరో పాత్రలో కనిపించబోతున్నారట. అయితే అది సినిమాలో హీరోగానా లేక ఇంకేదైనా కొత్త తరహాలోనా అని టాలీవుడ్ లో టాక్ వినిపిస్తుంది. దీనికి సంబంధించిన అప్డేట్ కూడా దసరా కానుకగా నేడు అక్టోబర్ 11న వస్తుందని సమాచారం. ఈ పాత్ర టాలీవుడ్ లో సరికొత్త సెన్సేషన్ సృష్టిస్తుంది అని అంటున్నారు. దీంతో బాలయ్య ఫ్యాన్స్ ఆసక్తిగా ఈ అప్డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. మరి నిజంగానే బాలయ్య సూపర్ హీరోగా కనిపించబోతున్నారా అంటే ఎదురుచూడాల్సిందే.



### వావ్.. ఇలాంటి డ్రెస్‌లేస్తే కుర్రాళ్లు పడిపోరు..

## చంపేస్తున్న త్రిప్తి దిమ్రీ..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10: ఎవరి దశ ఎప్పుడు తిరుగుతుందో ఎవ్వరు ఎక్స్‌పెక్ట్ చేయలేరు. ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీ వాళ్లకు ఇది బాగా వర్తిస్తుంది. కొన్ని సార్లు ఎంత లెంగ్తీ క్యారెక్టర్లు చేసిన, ఎంద గొప్పగా నటించిన పెద్దగా గుర్తింపు రాదు. అదే కొన్ని సార్లు లెంగ్త్ తక్కువ క్యారెక్టర్ చేసిన.. ఆ పాత్ర తాలూకు ఇంపాక్ట్ వల్ల ఎక్కడలేని పాపులారిటీ వచ్చేస్తుంది. రీసెంట్ టైమ్స్‌లో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి అలాంటి ఇంపాక్టే క్రియేట్ చేసింది. యానిమల్ సినిమాతో ఓవర్‌నైట్ పాపులారిటీ తెచ్చుకుంది బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రీ. త్రిప్తికి ఈ సినిమా తెచ్చిపెట్టిన పాపులారిటీ అంతా ఇంతా కాదు. యానిమల్ సినిమాలో రఫ్‌గా కనిపించేది పాతిక నిమిషాలు మాత్రమే. అది కూడా పాటతో కలుపుకుని. కానీ స్క్రీన్‌పై ఎంత సేపు కనిపించామన్నది కాదు.. ఏ రేంజ్‌లో ఇంపాక్ట్ చూపించామన్నది ఇంపార్టెంట్ అని ఈ బ్యూటీ నిరూపించింది.

## వేట్టయన్ మూవీ రివ్యూ: రజనీ బుల్లెట్ దిగిందా? లేదా..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10:రజనీకాంత్ సినిమా అంటే అభిమానులకు పండగే. 'జైలర్' తర్వాత ఆయన నుంచి వస్తున్న సినిమాగా 'వేట్టయన్' అందరిదృష్టిని ఆకర్షించింది. దీంతో పాటు అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ లాంటి స్టార్స్ చేరడం మరో ఆకర్షణ. పైగా జైభీమ్ లాంటి అవార్డ్ విన్నింగ్ సినిమా తీసిన జ్ఞానవేల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో వేట్టయన్ పై అంచనాలు పెరిగాయి. మరా అంచనాలను రజనీ అందుకున్నాడా? ఇంతకీ 'వేట్టయన్' కథ ఏమిటి ? కథ: అథియన్(రజనీకాంత్) ఓ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్. తప్పు చేసి చట్టం నుంచి తప్పించుకునే వాళ్ళని తన తూటాలతో శిక్షిస్తుంటాడు. శరణ్య (దుశారా విజయన్) అనే స్కూల్ టీచర్ దారుణంగా హత్యకి గురౌతుంది. ఈ కేసులో ఓ నిందితుడుని పట్టుకుంటారు పోలీసులు. అయితే ఆ నిందితుడు తప్పించుకోవడంతో ప్రభుత్వం పైనా, పోలీసు యంత్రాంగంపైన ఒత్తిడి పెరుగుతుంది. దాంతో అథియన్ రంగంలోకి దిగుతాడు. మరి హంతకుడిని మట్టు బెట్టాడా? ఈ కేసులో అసలు హంతకుడు ఎవరు? ఈ కథలో సత్యదేవ్ (అమితాబ్ బచ్చన్) ప్యాట్రిక్ (ఫహాద్ ఫాజిల్) నటరాజ్ (రానా దగ్గుబాటి ) పాత్రలు ఏమిటి? చివరికి శరణ్యకి న్యాయం జరిగిందా లేదా అనేది కథ. కథా విశ్లేషణ: న్యాయం, విద్య లాంటి సామజిక అంశాలని ఓ క్రైమ్ థ్రిల్లర్ జోనర్ కి ముడిపెట్టి మలిచిన సినిమా వేట్టయన్. గవర్నమెంట్ స్కూల్ పిల్లల వైరల్ వీడియోలని చూపిస్తూ కథ మొదలౌతుంది. ఇక్కడే ఈ కథలోని ఎడ్యుకేషన్ కోణానికి బీజం వేశాడు దర్శకుడు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ గా రజనీ పాత్రని పరిచయం చేసిన తీరు, యాక్షన్ సీక్వెన్స్, తర్వాత వచ్చే పాట ఫ్యాన్స్ ని జోష్ ఇస్తాయి. శరణ్య పాత్రతో ఈ కథలో కాన్ ఫ్లిక్ట్ తెరపైకి వస్తుంది. ఆమె హత్యతో కథ కీలకమలుపు తీసుకుంటుంది. తర్వాత క్రైమ్ థ్రిల్లర్ ని తలపించే సన్నివేశాలతో పాటు ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండ్ హాఫ్ పై ఆసక్తిని పెంచుతాయి. సెకండ్ హాఫ్ కి వచ్చేసరికి ఈ కథలో చరుకుదనం తగ్గుతుంది. కథనం అంతా ఊహకు ముందే అందిపోతుంది. రజనీ, రానా మధ్యవచ్చే సన్నివేశాలు కొన్ని ఆసక్తికరంగా ఉన్నప్పటికీ ఈ కథ మొత్తం అప్పటికే రివిల్ అయిపోవడంతో మిగతా సన్నివేశాలు అంతగా రక్తికట్టవు. దీంతో పాటు ఎడ్ టెక్ కంపెనీ చుట్టూ నడిపిన సీన్స్ ఒక దశలో బోరింగ్ గా అనిపిస్తాయి. వీటిని ఇంకాస్త పదునుగా చెప్పాల్సింది. ఈ కథలో సబ్ ప్లాట్ లేకపోవడం మరో వెలితి. మొత్తం సినిమా సింగిల్ థ్రెడ్ మీద నడపడం, చివర్లో సామాజిక సందేశం ఎక్కువైపోవడంతో ప్రేక్షకుడి ఆసక్తి సన్నగిల్లుతుంది.

**నటీనటులు నటన:** రజనీకాంత్ తనదైన శ్వాగ్ చూపించారు. నిజానికి రజనీ మార్క్ కథ కాదిది. అయినప్పటికీ ఉన్నంతలో తన మ్యాజిక్ ని చూపించారు. రజనీ మార్క్ ఫైట్స్ వుంటాయి. తన వయసుకు తగ్గ పాత్రే. అమితాబ్ బచ్చన్ తన అనుభవం చూపించారు. ఆ పాత్రని చాలా హుందాగగా చేశారు. ప్యాట్రిక్ పాత్రలో ఫహాద్ ఫాజిల్ ఆకట్టుకుంటాడు. మంజువారియర్ ది చిన్న పాత్రే. రానా దగ్గుబాటి స్టయిలీష్ విలనిజం చూపించారు. దుశారా విజయన్ చాలా నేచురల్ గా కనిపించారు. ఆమె పాత్రకు మంచి మార్కులు పడతాయి. మిగతా నటులు పరిధిమేర కనిపంచారు.

**టెక్నికల్:** అనిరుద్ బీజీఎం బావుంది. రజనీ మార్క్ ఎలివేషన్ సౌండ్స్ ఇవ్వగలిగాడు. కెమరాపనితనం, నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా వుండాల్సింది. 'గురిపెడితే ఎర పడాల్సిందే' డైలాగ్ పేలింది.

### హ్యాపీ బర్త్ డే

## రకుల్ ప్రీత్ సింగ్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10: హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తక్కువ సమయంలోనే ఎక్కువ ఫేమ్ తెచ్చుకున్న హీరోయిన్స్ లో ఈమె కూడా ఒకరు. తెలుగు స్టార్ హీరోల సరసన నటించి మంచి పేరు తెచ్చుకుంది రకుల్. ఈ ముద్దుగుమ్మ లైఫ్ లో కష్టాలే ఎక్కువ అని చెప్పుకోవాలి. ఎందుకంటే ఆ మధ్య డ్రగ్స్ కేసులో రకుల్ బ్రదర్ పేరు వినిపించిన విషయం మనకీ తెలిసిందే. ఆ తర్వాత మొన్నటికి మొన్న తెలంగాణకు చెందిన ఓ మంత్రి ఈమెపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. ఇలా ఒకటేంటి చెప్పుకుంటూ పోతూ ఉంటే చాలానే ఉన్నాయి.ఇలా కెరీర్ లో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నా..ఎక్కడ కూడా తగ్గలేదు, ధైర్యంగా ముందుకు అడుగేసి రకుల్ అందరికి ఆదర్శంగా నిలిచింది. ఇక వైవాహిక జీవితం గురించి మాట్లాడుకుంటే .. రెండేళ్లు బాలీవుడ్ నటుడితో డేటింగ్ లో ఉండి, ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నారు. ఈ రోజు రకుల్ ప్రీత్ సింగ్ పుట్టిన రోజు. ఈ నేపథ్యంలోనే పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు రకుల్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. అలాగే తాజాగా ఆమె పిక్స్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతున్నాయి.




### మోడ్రన్ డ్రెస్ లో ఐశ్వర్య రాజేష్..

## వైరల్‌గా గ్లామరస్ ఫోటోషూట్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10:ఐశ్వర్య రాజేష్.. చెన్నైలో జన్మించిన ఆమె సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేయడానికి ముందు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వచ్చింది. ఈ ఇబ్బందులు ఉన్నప్పటికీ, టెలివిజన్‌లో చిన్న పాత్రలతో ప్రారంభించి గరువారం స్టార్ హీరోయిన్ గా పేరు సంపాదించుకుంది.

### భారతీయులందరికీ ఇది బాధాకరమైన రోజు..

## రతన్ టాటాకు సినీ ప్రముఖుల నివాళులు



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10:ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన మృతిపట్ల పలు రంగాలకు చెందిన ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా నివాళులు తెలుపుతున్నారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు కూడా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంతాపం తెలియజేస్తున్నారు.

### భారతీయులందరికీ ఇది బాధాకరమైన రోజు: చిరంజీవి

"భారతీయులందరికీ ఇది బాధాకరమైన రోజు. సేవలో ఆయనను మించినవారు లేరు. మన దేశం ఇప్పటివరకు చూసిన గొప్ప దార్శనికులలో రతన్ టాటా ఒకరు. నిజమైన పారిశ్రామికవేత్త, పరోపకారి, అసాధారణమైన వ్యక్తి. టాటా బ్రాండ్‌లను ప్రపంచ పవర్‌హౌస్‌గా నిర్మించడమే కాకుండా మన దేశ నిర్మాణంలోనూ అద్భుతంగా దోహదపడ్డారు. నిజంగా మెగా ఐకాన్. మనం ఒక గొప్ప మనసున్న మంచి వ్యక్తిని కోల్పోయాం. భారతీయ పారిశ్రామికవేత్తలలో ఆయన పెంపొందించిన విలువలు, సమగ్రత, దృక్పథం ఎల్లప్పుడూ తరాలకు స్ఫూర్తినిస్తాయి. మార్గనిర్దేశం చేస్తాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరుగాక!" అని చిరంజీవి ట్వీట్ చేశారు.

### రతన్ టాటా ఓ లెజెండ్: రాజమౌళి

"రతన్ టాటా ఓ లెజెండ్. ఆయన ఎప్పటికీ మన హృదయాల్లో జీవించే ఉంటారు. టా టా ఉత్పత్తులను ఉపయోగించకుండా ఒక రోజును ఊహించుకోవడం కష్టం. రతన్ టాటా వారసత్వం నిత్య జీవితంలో ఇమిడిపోయింది. ఎన్నో తరాలకు స్ఫూర్తి. పంచభూతాలతో పాటు ఎవరైనా కాలపరీక్షకు నిలబడతారంటే అది ఆయనే. భారతదేశం కోసం మీరు చేసిన ప్రతిదానికీ ఎప్పటికీ రుణపడి ఉంటాం. లెక్కలేనన్ని జీవితాలను ప్రభావితం చేసినందుకు ధన్యవాదాలు సర్. మీరు తరతరాలుగా నిలిచిపోయే గుర్తును మిగిల్చారు. నీకు వందనం... ఎల్లప్పుడూ మీ ఆరాధకుడు... జై హింద్" అంటూ రాజమౌళి తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

### రతన్ టాటాది గోల్డెన్ హార్ట్: తారక్

"రతన్ టాటాది బంగారంలాంటి హృదయం. ఆయన నిస్వార్థ దాతృత్వం, దూరదృష్టి గల నాయకత్వం లెక్కలేనన్ని జీవితాలను మార్చేశాయి. భారతదేశం ఆయనకి ఎప్పటికీ రుణపడి ఉంటుంది. రతన్ టాటా ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా" అని ఎన్‌టీఆర్ ట్వీట్ చేశారు.

### భారత జాతికి పెద్ద నష్టం: రామ్‌చరణ్

"పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం భారత జాతికి పెద్ద నష్టం. ఆయనో ఐకానిక్ లెజెండ్. సామాన్యుడి నుండి వ్యాపార మార్గదర్శకుల వరకు చాలా మంది జీవితాలను ప్రభావితం చేశారు. గాఢంగా ప్రేమించే పరోపకారి. రతన్ టాటా సర్ వారసత్వం లక్షలాది మంది హృదయాల్లో నిలిచి ఉంటుంది" అని రామ్‌చరణ్ ట్వీట్ చేశారు.

### ట్రెడిషనల్ లుక్‌లో యాంకర్ లాస్య ..నవ్వుతో మెస్మరైజ్ చేస్తూ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 10:యాంకర్ లాస్య మంజునాథ్ దసరా శరన్నవరాత్రి వేడుకలు, బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఆమె తాజాగా ట్రెడిషనల్ శారీలో జరిపిన ఫోటోషూట్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నది. ట్రెండ్ అవుతున్న అందాల భామ ఫోటోలపై మీరు ఓ లుక్కేయండి



PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.